ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 1 జనవరి 2025



అందుబాటులో తెల్లజొన్నలు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు రాయితీపై సుచిత్ర పూలే తెల్లజొన్న విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిషాంత్ కుమార్ తెలిపారు. డెమో కోసం పంపిణీ చేయనున్న ఒక బ్యాగులో నాలుగు కిలోల విత్తనాలు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం వంద కిలోలు అందుబాటులో ఉన్నాయన్నారు. నాలుగు కిలోల బ్యాగు ధర రూ.260 ఉండగా.. రైతులు రూ.140 చెల్లించి తీసుకోవాలని తెలిపారు. అదేవిధంగా సాధారణ జొన్న విత్తనాలు 21 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ముగిసిన ధ్యాన వేడుకలు


ముగింపు వేడుకల్లో కేక్‌కట్ చేస్తున్న పరిణతి పత్రీజీ

- ధ్యాన, ఆధ్యాత్మిక వేత్తలకు సత్కారం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కడ్తాల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 11 రోజుల పాటు ధ్యాన సంబురాలు వైభవంగా కొనసాగాయి. ముగింపు వేడుకల్లో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కొర్పోలు విజయ భాస్కర్ రెడ్డి, పత్రీజీ కూతురు పరిణతి పత్రీజీ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యాన, ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. అదేవిధంగా పిరమిడ్ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు, నాయకులు లక్ష్మణ్ రావు, హన్మంతరావు, దామోదర్ రెడ్డి, మాధవి, లక్ష్మీ, శివప్రసాద్, బీక్యనాయక్, సేవ్యనాయక్, శంకర్, రామకృష్ణ, శంకర్ నాయక్, అంజి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు పోస్టింగ్

- నియామక పత్రాలను అందజేసిన డీఎంహెచ్‌వో


నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టులను ఎట్టకేలకు భర్తీ చేశారు. జిల్లాలో 74 పోస్టులకు గాను 56 పోస్టులను భర్తీ చేశారు. గత ఏడాది జూలైలో ఈ పోస్టులకు తెలంగాణ రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసింది. శాసనసభ ఎన్నికలతో కొంత ఆలస్యం ఏర్పడింది. ఇటీవల ఈ పోస్టులకు పరీక్షలుఖీ నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి శివరాంపల్లిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మెరిట్ ప్రకారం వారికి కావాల్సిన ప్రాంతానికి పోస్టింగ్ ఇస్తూ జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ అధికారి మహ్మద్ షఫియోద్దీన్, డీపీఎంవో (ఎన్‌హెచ్‌ఎం) అక్రమ్, పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో సాగర్ రహదారిపై పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం శ్రమించిన అంబేడ్కర్‌ను తక్కువచేసి మాట్లాడటం తగదన్నారు. అమిత్‌షా వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాంచందర్, జగదీష్, చంద్రమోహన్, నర్సింహ్మా, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, బుగ్గరాములు తదితరులున్నారు.


ముగవని రిసార్ట్‌లో న్యూఇయర్ వేడుక

గ్రాండ్ వెల్‌కమ్

ధూంధాంగా న్యూఇయర్ వేడుకలు

జిల్లా ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి ఉల్లాసంగా ఉత్సాహంగా స్వాగతం పలికారు. డిసెంబర్ 31 సందర్భంగా చిన్నాపెద్ద అనే తేడా లేకుండా విందు వినోదాల్లో మునిగి తేలారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే 2025 నూతన సంవత్సరానికి స్వాగతమంటూ ఆనందోత్సాహాలతో ఎగిరి గంతేశారు. కేక్ కటింగ్‌లు చేసి హ్యాపీ న్యూ ఇయర్ అని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు బైక్ ర్యాలీలు తీస్తూ కేరింతలు కొట్టారు.

- డీజే మోతలతో ఉర్రూతలూగిన యువత
- కిక్కిరిసిన రిసార్ట్‌లు, పబ్బులు, స్టార్ హోటళ్లు
- జోరుగా మద్యం, మాంసం అమ్మకాలు
- గేటెడ్ కమ్యూనిటీల్లో కుటుంబ సభ్యులతో కేక్ కటింగ్‌లు
- పొలాల వద్ద యువకుల దావత్‌లు
- కట్టుదిట్టంగా సైబరాబాద్, రాచకొండ పోలీసుల భద్రత చర్యలు
- రాత్రి 8గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నోవాటెల్, శంకర్‌పల్లి మండలంలోని ప్రగతి రిసార్ట్స్, పర్వేద పరిధిలోని ఫాంఎక్సోటికా రిసార్ట్స్, గ్రీన్‌వాలీ, మొయినాబాద్ మండలం కనకమామిడిలోని బ్రౌన్‌టౌన్, పోలో రైడింగ్ క్లబ్, చిలుకూరులోని మృగవని ఏకో రిసార్ట్స్‌లో, ముర్తుజాగూడలోని ఈవెన్ రిసార్ట్స్ న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంచాల మండలం కాగజ్‌గట్‌లోని సిరివాల్యూ రిసార్ట్స్ మహేశ్వరం మండలంలో మ్యాక్ విల్లాస్, రాంకి విల్లాస్‌లో న్యూఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రిసార్ట్స్‌లు, క్లబ్‌లు, హోటళ్లలో న్యూఇయర్ వేడుకలు పోటాపోటీగా నిర్వహించారు. అలాగే గేటెడ్ కమ్యూనిటీల్లో, సొంత వ్యవసాయ క్షేత్రాల్లో వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. బిర్యానీ బుకింగ్‌లు

మిగతా 8వ పేజీలో...



కొత్త ఆశయాలతో ముందుకు సాగాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

జిల్లా ప్రజలకు కలెక్టర్ సి. నారాయణరెడ్డి న్యూ ఇయర్ విషెస్ తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలన్నారు. సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని, ఎల్లవేళలా మంచి జరగాలని ఆకాంక్షించారు. 2024లో ఎదురైన అనుభవాలను సానుకూలంగా మల్చుకుని, 2025లో మరింత పట్టుదలతో విజయాలను కైవసం చేసుకోవాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కొత్త సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి జిల్లాను మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్దామని చెప్పారు.

అందరికీ శుభాలు చేకూరాలి

ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి



కొత్త సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మడి జిల్లా ప్రజలకు న్యూఇయర్ విషెస్ తెలిపారు. కొత్త సంవత్సరంలో లక్ష్యాలను నిర్దేశించుకొని విజయాలు సాధించాలన్నారు. ప్రతీ కుటుంబంలో ఆనంద వెలుగులు నిండాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వంటింట్లో మంటలు!

నూనె ధరలు సలసల

కూర వండాలన్నా.. చారు చేయాలన్నా.. చట్నీ పోపు పెట్టాలన్నా నూనె తప్పనిసరి. అలాంటి నూనె ధరలు ప్రస్తుతం వంటింట్లో మంటలు పుట్టిస్తున్నాయి. ఆ సెగలకు సామాన్యులు విలవిలలాడుతున్నారు. అసలే నిత్యావసర ధరలు పెరిగి మధ్యతరగతి కుటుంబాలు దిక్కులు చూస్తుంటే.. నూనె రేట్ల పెంపు మరింత భారంగా మారింది. అలాగే సామాన్యుల నెలవారీ బడ్జెట్ ఒక్కసారిగా లెక్క తప్పినట్లయింది. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని జనం ఆందోళన చెందుతున్నారు.

- లీటర్ నూనె రేటు సుమారు రూ.50 పెంపు
- పామాయిల్ రూ.140, సన్‌ఫ్లవర్ రూ.150
- బెంబేలెత్తుతున్న మధ్యతరగతి కుటుంబాలు

చేవెళ్ల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : వంట నూనెల ధరలు ఆకాశాన్నంటాయి. రోజురోజుకూ రేట్లు ఎగబాకుతున్నాయి. మూడు నెలల క్రితం నూనె ప్యాకెట్ ధరకు ప్రస్తుతానికి సుమారు రూ.50 తేడా ఉంది. ఇంతగా ధర పెరగడంతో పేద కుటుంబాలు రోజూ కూర వండుకోలేని పరిస్థితి నెలకొంది. ధరలను నియంత్రించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులు అధికంగా

మిగతా 8వ పేజీలో...

వంట నూనెల ధరలు

నూనె రకం	3 నెలల క్రితం	ప్రస్తుతం
పామాయిల్	రూ.95	రూ.140
సన్‌ఫ్లవర్	రూ.115	రూ.150
వేరుశనగ	రూ.180	రూ.230
రైస్ బ్రాండ్	రూ.150	రూ.190


మహిళలతో మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- డీఆర్డీవో శ్రీలత

మహేశ్వరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది చిరు వ్యాపారాల్లో రాణించడం అభినందనీయమని డీఆర్డీవో శ్రీలత అన్నారు. అమీర్‌పేట, మహేశ్వరం, తుమ్మలూరు, మన్సాన్‌పల్లిలో మహిళా సంఘాల ద్వారా సూక్ష్మజీవనోపాధుల కింద రుణాలు తీసుకొని కొనసాగిస్తున్న వ్యాపారాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను మహిళాసంఘ సభ్యులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, ఏపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు
పక్కా భవనాలు



- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం
- అత్యాధునిక రీతిలో కార్పొరేట్ తరహాలో నిర్మాణాలు
- గచ్చిబౌలి, ఫోర్త్‌సిటీ, ఉప్పల్‌లో తొలిదశ నిర్మాణాలు
- వచ్చే నెలలోనే శంకుస్థాపనలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : కొత్త ఏడాది ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులకు తీపికబురు తెలిపింది. ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవన నిర్మాణాలకు సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తొలివిడతలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అత్యాధునిక రీతిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. వచ్చే నెలలోనే వీటి నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు దశలవారీగా కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు నిర్మిస్తామని తెలిపారు. మొదటి దశలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. వాస్తవానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు రాష్ట్రంలోనే సింహభాగం ఆదాయం ఉమ్మడి జిల్లా నుంచే అందుతుంది. కానీ ఇప్పటివరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు

మిగతా 6వ పేజీలో...

జీవన పోరాటం... ఆహారానికి ఆరాటం



ఓ వైపు రైతు తన జీవనానికి పోరాటం చేస్తుంటే.. కొంగలు తమ ఆహారం కోసం ఆరాట పడుతున్నాయి. వరి నారు పోయడానికి అన్నదాత పొలం దున్నుతుండగా, కొంగలు మడిలోని పురుగులను వేటాడుతూ పొట్ట నింపుకుంటున్నాయి. ఈ అరుదైన దృశ్యం చిన్నతుల్ల గ్రామంలో కనిపించగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

యాచారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి)

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు

పక్కా భవనాలు

(5వ పేజీ తరువాయి)

లేక అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఈ సమస్య తీరనుంది. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు గండిపేట, శేరిలింగంపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కలిపి గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించనున్నారు గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్)లో అత్యాధునిక రీతిలో మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అన్ని హంగులతో నిర్మించాలని నిర్ణయించారు. అలాగే మేడ్చల్ జిల్లా పరిధిలో కుత్బుల్లాపూర్, ఉప్పల్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఉప్పల్‌లో నిర్మించనున్నారు. కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫ్యూచర్ సిటీలో నిర్మించనున్నారు. మొదటి దశలో నిర్మించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కనీసం మూడు ఎకరాల్లో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 10 నుంచి 15వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం చేపడుతున్నారు. వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయాలు, విశాలమైన పార్కింగ్ వంటి వసతులు ఉండేలా డిజైన్ రూపొందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో అత్యాధునిక రీతిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలను సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్ వ్యవస్థీకరణ కూడా చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రకారం పనిభారం ఎక్కువగా ఉన్నచోట్ల కొత్తగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. దీని ప్రకారం నగర శివార్లలో మరి కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి.

ముంబై రైళ్లకు అదనపు బోగీలు

- కొత్త ఏడాదిలో అమలు
- రేపటి నుంచి అదనపు కోచ్‌లు
- తీరనున్న ప్రయాణికుల అవస్థలు



తాండూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ముంబై వెళ్లే ప్రయాణికులకు రైల్వేశాఖ శుభ వార్త చెప్పింది. తాండూరు మీదుగా ముంబైకి వెళ్లే రైళ్లకు అదనపు బోగీలను అమర్చనున్నట్లు ప్రకటించింది. ముంబై వెళ్లే రైళ్లలో రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వేశాఖ రేపు(గురువారం) నుంచి హైదరాబాద్(నాంపల్లి) నుంచి ముంబై(22731), ముంబై నుంచి హైదరాబాద్ (నాంపల్లి) వచ్చే రైలుకు, హైదరాబాద్(నాంపల్లి) నుంచి ముంబై(12702), ముంబై-హైదరాబాద్(నాంపల్లి) (12701) హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రెండు జనరల్‌సెకండ్ కోచ్‌లను, స్లీపర్ కోచ్‌లను అదనంగా కలపాలని దక్షిణ మధ్య రైల్వేశాఖ నిర్ణయించింది. కరోనా తర్వాత ముంబైకి వెళ్లే రైళ్లలో కేవలం ముందు, వెనుక భాగంలో ఒక్కొక్క జనరల్ బోగీలు ఉండేవి. ఈబోగీలు హైదరాబాద్ (నాంపల్లి) రైల్వేస్టేషన్‌లోనే బెర్తులన్నీ నిండిపోయి కింద కూర్చునేవారు. కాళ్లు పెట్టడానికీ స్థలం ఉండేదికాదు. మూడేళ్లుగా తాండూరు రైల్వేస్టేషన్‌కు చేరుకునే వలసకుటుంబాలు పూణె, బీవండి, ముంబై, పట్టణాలకు ఈ రైళ్లలో వెళ్లడానికి కష్టాలుపడుతూ ప్రయాణించేవారు. ఈ అదనపు కోచ్‌ల ఏర్పాటు వలస కార్మికులకు, ప్రయాణ కష్టాలు తీరనున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో దాడికి పాల్పడిన 12 మందిపై కేసు

దోమ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని గుండాల్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో జరిగిన దాడిలో 12 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దోమ ఎస్సై ఆనంద్‌కుమార్ తెలిపారు. వీరితో పాటు మరో 40 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సంతోషాన్ని విషాదంగా మార్చుకోవద్దు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అనవసరంగా ఆర్భాటాలకు పోయి సంతోషంగా జరుపుకునే నూతన సంవత్సర వేడుకలను విషాదంగా మార్చుకోవద్దని షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. రిసార్ట్స్, ఫాంహౌజ్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు నిర్వహించినా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి, రాష్, ట్రిపుల్ రైడింగ్, నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలిపారు. అర్ధరాత్రి రేసింగ్‌లు, బైక్ ర్యాలీలు నిషేధమని, నాఖాబందీ, వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తామని తెలిపారు. వేడుకల పేరుతో ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే శిక్షలు ఉంటాయన్నారు. ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

నందిగామ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు అధైర్యపడవద్దని, అండగా ఉంటానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎదిర వెంకటయ్యగౌడ్, అల్వాల వెంకటయ్యలు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికి పరిమితమయ్యారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లెల్ల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు జంగ నర్సింలు, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ చాకలి నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, సి.కృష్ణ, సుమన్, ఎదిర శ్రీకాంత్‌గౌడ్, పిట్టల రాములు, చాకలి బాల్‌రాజ్, రమేష్, వెంకటేష్, గోపాల్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తాం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతుబిడ్డగా పరిగి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు అందించడమే లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శివారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం భారతీయ వరి పరిశోధనాసంస్థ రాజేంద్రనగర్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ నేలల దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్, జూరాల ప్రాజెక్టులు ఉన్న మన ప్రాంతానికి నీరు రాకపోవడంతో ఎడారిగా మారిందన్నారు. ఈ ప్రాంతానికి నీరు తీసుకురావడానికి వైఎస్సార్ హయాంలో ప్రాణహిత చేవెళ్ల ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేసినా ప్రభుత్వం మారడంతో ఆగిపోయిందన్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఉదండపూర్, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుల ద్వారా పరిగి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు ప్రసాద్‌బాబు, అరవింద్‌కుమార్, పద్మకుమారి, ఏసుదాసు, మహేందర్‌కుమార్, ఏఎంసీ చైర్మన్లు ఆంజనేయులు, పరశురాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సమయపాలన పాటించని వైద్యసిబ్బంది



ఆసుపత్రిలో డాక్టర్ కోసం ఎదురు చూస్తున్న రోగులు



ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ

శంకర్‌పల్లి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): టంగటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సమయ పాలన పాటించక పోవడంతో రోగులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది ఉదయం 9గంటలకు రావాల్సి ఉండగా.. 10.30 గంటలు దాటినా రాకపోవడంతో వైద్యకోసం వచ్చిన రోగులు అవస్థలు పడ్డారు. ఆరోగ్యకేంద్ర సిబ్బందితో పాటుగా యునాని ఆసుపత్రి డాక్టర్ మినాజుద్దీన్ ఖాన్‌తో పాటు సిబ్బంది సైతం రాకపోవడం గమనార్హం. నెల రోజుల క్రితం కలెక్టర్ నారాయణరెడ్డి శంకర్‌పల్లికి వచ్చిన సమయంలో అధికారుల్లో మార్పు రావాలని ఆదేశించినప్పటికీ అదేమీ కనిపించక పోవడం శోచనీయం. అధికారులు ఇప్పటికైనా సమయపాలన పాటించాలని రోగులు, గ్రామస్తులు కోరుతున్నారు.

నన్ను ఎవరూ దూషించలేదు

- ప్రభుత్వ చీఫ్‌విప్ తిట్టినట్లు వచ్చిన ప్రచారం అవాస్తవం
- మైన్స్ ఏడీ సత్యనారాయణ



తాండూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి తనను దూషించినట్లు సోషల్ మీడియాలో, కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని తాండూరు మైన్స్ శాఖ ఏడీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు మహేందర్‌రెడ్డి ఎప్పుడూ ఫోన్ చేయలేదని, ఆయన ఫోన్ చేస్తే తాను ఫోన్ ఎత్తలేన్నది నిజంకాదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకూ చెప్పినట్లు వెల్లడించారు. తాండూరు మైన్స్ ఏడీగా పనిచేస్తున్న తనకు ఎలాంటి రాజకీయ ఒత్తిడిలు కానీ, ఇబ్బందులు కానీలేవని తెలిపారు. తాను బదిలీ కోసం, సెలవు కోసం ప్రయత్నిస్తున్నట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని అన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్

యాచారం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం యాచారం మండలంలోని గునగల్ మోడల్ పాఠశాలలో డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సులో చరణ్ మాట్లాడారు. సమాజ శ్రేయస్సుకు యువత పాటు పడాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. నాయకులు విప్లవ్ కుమార్, శ్రీకాంత్, వంశీ, తరంగ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెనకు మరమ్మతులు చేయించాలి



వినతిపత్రం అందజేస్తున్న గణేశ్

ఘట్‌కేసర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ రైల్వే వంతెన మరమ్మతులు చేయించాలని పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గణేష్ మంగళవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి వినతి అందజేశారు. నగరంలోని మంత్రి నివాసంలో కలిసి సమస్యను వివరించా రు. అనేక సంవత్సరాల నుంచి వంతెనపై రోడ్డుకు కనీస మరమ్మతులకు నోచుకోక గుంతలమయమై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.



కొత్తూర్ : విద్యార్థులు తయారుచేసిన ఐటమ్స్‌ను తిలకిస్తున్న ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

యాచారం/కొత్తూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని, టీచర్లు చొరవ తీసుకోవాలని హెచ్‌ఎం వెంకటరమణ శాస్త్రి అన్నారు. యాచారం మండలం నందివనపర్తి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. ఈమేరకు హెచ్‌ఎం ప్రారంభించారు. విద్యార్థులు చికెన్ బిర్యానీ, డబుల్‌కామీటా, ఆలుఫ్రై, పులిహోర, మంచూరియా, నువ్వుల లడ్డు, జొన్నరొట్టె తదితర వంటకాలు తయారు చేశారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు. అలాగే ఇంటి ఆహారంతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని కొత్తూర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు అభిప్రాయపడ్డారు. మండల కేంద్రంలోని ఎస్‌వీఆర్ పాఠశాలలో కరస్పాండెంట్ వీరమోని దేవేందర్ ముదిరాజ్ అధ్వర్యంలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను ఇన్‌స్పెక్టర్ ప్రారంభించారు. ఎస్సైలు శ్రీనివాస్, మురళీగౌడ్, ఎంఈవో అంగోర్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాలపై చర్యలు తీసుకోవాలి



ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మర్రిపల్లిగూడకు చెందిన శివరాత్రి వెంకటేష్, ఎదులాబాద్‌కు చెందిన సాల్వేరు రామ్‌నాథ్‌లు మంగళవారం సాయంత్రం ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వేనెంబరు 5 పార్థు వెంచర్‌లోని ప్లాట్‌నెంబర్ 38యజమానులు బొంత వీరారెడ్డి, రాఘవేందర్‌రెడ్డిలు రోడ్డు కబ్జాచేసి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాదాపు 14అడుగుల రోడ్డును కబ్జా చేశారని తెలిపారు. 5పార్థులో నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణదారులు రోడ్లను కబ్జాచేస్తున్నా స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. రోడ్ల కబ్జాకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

వంటింట్లో మంటలు!

(5వ పేజీ తరువాయి)

ఉపయోగించే పామాయిల్, సన్ ఫ్లవర్ నూనెల ధరలు అధికంగా పెరగడంతో శుభకార్యాలు, పండగలు చేసుకోలేక పోతున్నామని సామాన్యులు వాపోతున్నారు.

నాలుగు నెలల్లో ధరలు పైపైకి...

రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే నిత్యావసర సరుకుల ధరలను నియంత్రిస్తామని ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ వైపుగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం వంట నూనెల దిగుమతులపై 12.5 శాతం నుంచి 32.5 శాతానికి సుంకం పెంచడంతో లీటరు నూనె ప్యాకెట్‌కు దాదాపుగా రూ.50 వరకు పెరిగింది. ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ ఊసేది..?

పామాయిల్, సన్ ఫ్లవర్, సోయాబీన్ వంట నూనెలకు గతంలో బేసిక్ కస్టమ్స్ సుంకాలు ఉండేవి కావు. ప్రస్తుతం వాటిపై కేంద్రం 20 శాతం సుంకాన్ని విధించింది. శుద్ధి చేసిన వంట నూనెలపై 12.5 శాతం ఉన్న సుంకాన్ని 30.5 శాతానికి పెంచేసింది. దీంతో లీటరు నూనె ప్యాకెట్‌పై రూ.35 నుంచి రూ.50 వరకు ధర పెరిగింది. గతంలో వంట నూనె, కంది పప్పు ధరలు పెరిగినప్పుడు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీపై ప్రభుత్వాలు సరఫరా చేసేవి. కానీ ప్రస్తుతం అలాంటివేవి లేకపోవడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు.

చేవెళ్ల నియోజకవర్గంలో..

చేవెళ్ల నియోజకవర్గంలో ఐదు మండలాల్లో కలిపి దాదాపు 2 లక్షలకుపైగా జనాభా ఉంది. 60 వేలకుపైగా కుటుంబాలు ఉన్నాయి. ప్రతీ కుటుంబానికి నెలకు రెండు నుంచి మూడు లీటర్ల వంట నూనె అవసరం. వీరితో పాటు నూనె ఆధారంగా తినుబండారాలు తయారు చేసి అమ్మకాలు చేపడుతున్నా వారితో కలిసి సగటున నియోజకవర్గంలో నెలకు లక్ష నుంచి రెండు లక్షల లీటర్ల నూనె వాడకం ఉంటుందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. నూనె ధరలు పెరగడంతో సామాన్యులు వంటింట్లో కూరలు వండలేని పరిస్థితి ఉంది. నూనె కొనలేక వ్యాపారులు తినే పదార్థాల తయారీకి వెనుకడుగు వేస్తున్నారు.

ఏం కొనలేం.. ఏం తినలేం

పెరుగుతున్న ధరలతో ఏం కొనేటట్లు లేదు.. ఏం తినేటట్టు లేదు. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగాయి. ఇప్పుడు నూనె ధరలు కూడా మండుతున్నాయి. ధరల నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్తే 5 రకాల వస్తువులు కూడా రావడం లేదు.

- మాధవగౌడ్, వినియోగదారుడు, కమ్మెట గ్రామం, చేవెళ్ల మండలం

గ్రాండ్ వెల్‌కమ్

(5వ పేజీ తరువాయి)

ఫుల్లుగా జరిగాయి. న్యూ ఇయర్ సందర్భంగా బార్లు, వైన్ షాపులు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచుకోవచ్చని తెలంగాణ ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చింది. దీంతో బార్లు, వైన్‌షాపులు కిటకిటలాడాయి. చికెన్, మటన్, చేపల కొనుగోళ్లు జోరుగా సాగాయి. బేకరీల్లో కేకులు కొనుగోలు చేయడానికి జనం ఎగబడ్డారు.



ఆమనగల్లు : రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



చేవెళ్ల : బేకరీలో కేకులు విక్రయిస్తున్న దృశ్యం

ప్రత్యేక నిఘా..

ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంప్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేసిన వారిని గుర్తించేందుకు రంగారెడ్డి జిల్లాలోని సైబరాబాద్, రాచకొండ పోలీసులు ప్రత్యేక కెమెరాలను అమర్చారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు చూపని వాహనదారులను తాత్కాలికంగా కస్టడీలోకి తీసుకున్నారు. మద్యం సేవించి డ్రైవ్ చేసిన వారిపై మోటర్ వెహికిల్స్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారు.

క్రైం కార్నర్

అమానుషం!

● చెట్లపొదల్లో శిశువు మృతదేహం లభ్యం

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుడితే భారమనుకున్నారో లేదా ఇంకేదైనా కారణమో.. శిశువు చెట్ల పొదల్లో పడేసిన అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. పుట్టిన గంటల్లోనే గుర్తుతెలియని వ్యక్తులు మగ శిశువును చెట్ల పొదల్లో పడేశారు. ఈ సంఘటన మంగళవారం షాద్‌నగర్ పట్టణం చటాన్‌పల్లి శివారులో వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ కథనం మేరకు.. మగ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు పుట్టిన గంటల వ్యవధిలోనే చెట్ల పొదల్లో పడేశారు. అయితే, శిశువు చనిపోయిన తర్వాత పడేశారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొత్తూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పెంజర్ల రోడ్డులో నివాసం ఉంటున్న వెంకటేష్(58) అనే వ్యక్తి సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై వెంకటేష్ తెలిపారు. వెల్డింగ్ పనులు చేసి జీవనం కొనసాగిస్తున్న వెంకటేష్ కొన్ని సంవత్సరాలుగా భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ, అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో జీవితం మీద విరక్తి చెందిన వెంకటేష్ ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు వెంకటేష్ కుమారుడు జగదీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొత్తూర్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలో వైజంక్షన్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. నందిగామ మండల కేంద్రానికి చెందిన ప్రశాంత్, కృష్ణ, శేఖర్‌లు ద్విచక్ర వాహనంపై వై జంక్షన్ వైపు వెళ్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈమేరకు స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

దైవచింతన అలవర్చుకోవాలి



నందిగామ : బుగ్గోనిగూడలోని శివాలయంలో పూజల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు



కందుకూరు : పూజల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు/మంచాల/నందిగామ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం నందిగామ మండల పరిధిలోని బుగ్గోనిగూడలో శివాలయంలో జరిగిన అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు జంగ నర్సింలు, క్రిష్టారెడ్డి, కొమ్ము కృష్ణ, తదితరులున్నారు. కందుకూరు మండలం అగర్‌మియాగూడలో ఇరుముడి మహాపడిపూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన 15మంది అయ్యప్ప మాలలు ధరించి 45 రోజుల పాటు భక్తి శ్రద్దలతో స్వామివారికి పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు లిక్కి జంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎస్.సురేందర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, డిల్లీ గణేష్, ప్రసన్న, లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులున్నారు. మంచాల మండలం జాపాలలో బకున సుకన్యచంద్రకాంత్ దంపతుల ఆధ్వర్యంలో పడిపూజ, అన్నప్రసాద వితరణ చేశారు. స్వామి వారిని పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. భజనమండలి శ్రీశైలం గురుస్వామి ఆధ్వర్యంలో ఆలపించిన అయ్యప్ప పాటలు అలరించాయి. పడిపూజ అనంతరం గ్రామానికి చెందిన 32 మంది అయ్యప్ప మాలధారులు ఇరుముడులు శబరికి తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్రనేత క్యామ మల్లేష్, మండలాధ్యక్షుడు రమేష్, చంద్రయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కావలి చంద్రశేఖర్

● డైరెక్టర్లుగా పాండు, లక్ష్మారెడ్డి



చంద్రశేఖర్ పాండు లక్ష్మారెడ్డి

షాబాద్/చేవెళ్ల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఏర్పాటులో భాగంగా చేవెళ్ల నియోజకవర్గానికి ప్రాధాన్యత లభించింది. ఈమేరకు చైర్మన్‌గా షాబాద్ మండలం హైతాబాద్ గ్రామానికి చెందిన కావలి చంద్రశేఖర్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ షాబాద్ మండలాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అలాగే చేవెళ్ల మండలానికి చెందిన జూకన్నగారి లక్ష్మారెడ్డి, కుర్వ పాండులను డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, ఈ కమిటీ రెండు సంవత్సరాలు కొనసాగుతుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. చేవెళ్ల నియోజకవర్గానికి వైస్ చైర్మన్‌తోపాటు ఇద్దరికి డైరెక్టర్లుగా అవకాశం దక్కడంతో నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, పాండు, లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ తమను వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా నియమించినందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

ఆమనగల్లు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. దేశంలో మరేరాష్ట్రంలో లేని విధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షలు అందిస్తుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బాధిత కుటుంబాలకు నారాయణ రెడ్డి అందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుపేలందరికీ దశలవారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీను, నాయకులు శ్రీశైలం, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, దారెడ్డి అంజన్ రెడ్డి, వెంకటేశ్, రామకృష్ణ, నర్సింహ, రమేశ్, రమేశ్‌గౌడ్, బాబా, విఠలయ్య గౌడ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో మరింత ప్రగతి : కసిరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో కల్వకుర్తి నియోజకవర్గం మరింత అభివృద్ధి చెంది అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. 2025 నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. 2025 సంవత్సరం అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగి నియోజకవర్గం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందని నారాయణరెడ్డి పేర్కొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

శంకర్‌పల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్ కుమార్, ఉపాధ్యక్షుడు జైరాంరెడ్డిలు డిమాండ్ చేశారు. ఈమేరకు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఫౌండేషన్ సభ్యులు శంకర్‌పల్లి ఎంఈవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలల్లో అధిక ఫీజులతో పాటు డ్రెస్సులు, షూ, టై, బెల్టులు, బ్యాడ్జీలు అమ్ముతూ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయని ఆరోపించారు. వారి వేధింపులతో విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేణేంద్రచారి, సభ్యులు రవి, ధీరజ్ ఉన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

మహేశ్వరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని తుక్కుగూడకు చెందిన సురేఖకు మంగళవారం పురినొప్పులు వచ్చాయి. దాంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా పురుటినొప్పులు ఎక్కువవడంతో 108 సిబ్బంది సురేఖకు నార్మల్ డెలివరీ చేశారు. ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబ సభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం 61వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, వివిధ సంఘాల నేతలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయం, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, మ్యాక్సివిజన్ సూపర్‌స్పెషాలిటీ ఐ హాస్పిటల్స్ సహకారంతో మెగా ఐకేర్ శిబిరాన్ని మంగళవారం ఎయిర్‌పోర్టులో నిర్వహించారు. డ్రైవర్లకు, వివిధ ఏజెన్సీలకు అనుబంధంగా ఉన్న వారితోపాటు ఆపరేటర్లకు, విమానాశ్రయ పర్యావరణ వ్యవస్థలోని కార్మికులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కంటి పరీక్షలు, రాయితీపై కంటి అద్దాలు అందించారు. భద్రతను ప్రోత్సహించేందుకు, సామర్థ్యాన్ని మెరుగుపర్చేందుకు కంటి వైద్యశిబిరం ఎంతో ఉపయోగపడుతుందని, మెరుగైన సేవలు అందించవచ్చని జీఎంఆర్ అధికారులు తెలిపారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

చేవెళ్ల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటం చేస్తోందని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు దేవేందర్, చేవెళ్ల మండలాధ్యక్షుడు సమీర్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. నాయకులు చరణ్‌గౌడ్, తేజ, వీనస్, శివ, సందీప్, సాయిచరణ్, సిద్దు, ప్రవీణ్, సంతోష్, సౌమ్య, మమత, అమూల్య, గాయత్రి, సంధ్య, లావణ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కడ్తాల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు పోతుగంటి అశోక్ అన్నారు. కడ్తాల మండలం వంపుగూడలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అశోక్ పరిశీలించారు. చివరి తేదీ కావడంతో ఇంటింటికీ తిరిగి సర్వేను పూర్తి చేయాలని అధికారులు, సిబ్బందిని కోరారు. పంచాయతీ కార్యదర్శి సందీప్, వీరయ్య, రవి, శివ, రమేశ్ తదితరులు ఉన్నారు.



ఇబ్రహీంపట్నం : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి ● నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

శంకర్‌పల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన పీఏసీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మోకిలలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఈవో రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, డైరెక్టర్లు పాండు, జంగయ్య, ప్రతాప్‌రెడ్డి, అనంతయ్య, శారద. మాజీ ఎంపీపీ నర్సింలు, నాయకులు ఉపేందర్‌రెడ్డి. సిబ్బంది సురేందర్, రవిందర్, శశిధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఓం ప్రగతి సమాఖ్య ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఇబ్రహీంపట్నంలో మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు మెట్టు అశోక్‌రెడ్డి, సీఈవో సంగీత, ఉపాధ్యక్షురాలు నెల్లూరి నాగమణి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి

పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

కందుకూరు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్-2025ను చైర్మన్ డి.చంద్రశేఖర్, వైఎస్ చైర్మన్ జి.విజయేందర్‌రెడ్డిలు మంగళవారం ఆవిష్కరించారు. డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, ఎన్.నర్సింహ, జి.అంజమ్మ, కె.యశోద, ఎస్.వెంకటరామిరెడ్డి, సాధ పాండురంగారెడ్డి, పొట్టి ఆనంద్, కార్యదర్శి యాదగిరిరెడ్డి, రైతులు పి.అంజయ్య, ఎడ్ల రామిరెడ్డి, కె.సత్తయ్య, దర్శన్, రాములు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓంశాంతి ఆధ్వర్యంలో..

చేవెళ్ల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఓం శాంతి సంస్థ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ కృష్ణయ్య ఆవిష్కరించారు. డీటీ రాజేంద్ర, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఓం శాంతి సభ్యులు పాండుయాదవ్, బాల్‌రెడ్డి, శశికళ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'హెచ్‌ఎంపై దాడి' బాధ్యులను అరెస్టు చేయాలి

మహేశ్వరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై అయ్యప్ప స్వాముల ముసుగులో దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కుల అసమానతల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి అన్నారు. అయ్యప్ప మాలతో ఉన్న విద్యార్థిని హెచ్‌ఎం కొట్టాడనే నెపంతో కొందరు అయ్యప్ప మాలధారులతో పాటు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు చెందిన నాయకులు ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేయడం సరికాదని అన్నారు. ఈమేరకు నాయకులు మంగళవారం మీర్‌పేట్‌లోని హెచ్‌ఎం ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోవిందు, సరోజన, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీకి ఆదరణ

కేశంపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని బీజేపీ కేశంపేట మండల సభ్యత్వ నమోదు కో-కన్వీనర్లు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, కుమ్మరి మహేష్‌లు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బూత్ కమిటీ అధ్యక్షులను మంగళవారం ఎన్నుకున్నారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో 116, 117 బూత్ అధ్యక్షులుగా ఉడిత్యాల శ్రీశైలం, కానం సందీప్ గౌడ్, తొమ్మిదిరేకులలో 128, 129 బూత్ కమిటీ అధ్యక్షులుగా లాలమోని యాదయ్య, తంగళ్లపల్లి సురేష్ చారి, కాకునూర్‌లో 126, 127 బూత్ అధ్యక్షులుగా ఉప్పరి సుదర్శన్, జట్టురి గోపాల్ రెడ్డి, సుందారాపూర్ గ్రామంలో 122 బూత్ అధ్యక్షుడిగా మల్లారెడ్డి, సంగెం గ్రామంలో 147 బూత్ కమిటీ అధ్యక్షుడిగా యాదగిరి గౌడ్, పట్టోనిగూడలో 148 బూత్ కమిటీ అధ్యక్షుడిగా అజయ్ కుమార్, లేమామిడిలో 133, 134 బూత్ కమిటీ అధ్యక్షులుగా రాఘవేందర్ గౌడ్, శేఖర్ రెడ్డి ఎన్నుకొని నియామకపత్రాలు అందించారు. కార్యక్రమంలో కానం ఉదయ్ కుమార్ గౌడ్, చౌడం శ్రీనివాస్, కల్వకోలు తిరుపతి, శివాచారి, కృష్ణయ్య, పల్లె అశోక్, మహేందర్, చందు, శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు

యాచారం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు మేడిపల్లి, యాచారం, మీర్‌ఖాన్‌పేటలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. కార్లు, ద్విచక్ర వాహనదారులను పరీక్షించిన తరువాతే స్వస్థలాలకు వెళ్లడానికి అనుమతించారు. యాచారంలో సీఐ నర్సింహరావు, కృష్ణంరాజులు తనిఖీ చేశారు. అలాగే హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై ఆర్టీఏ అధికారుల అనుమతి పత్రాలు లేని వాహనాలు తనిఖీ చేసి చలాన్లు విధించారు. సీఐ ఎ.నర్సింహారావు, ఎస్సై మధు పాల్గొన్నారు.



మేడిపల్లిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న సీఐ కృష్ణంరాజు

సనాతన ధర్మం పేరుతో దాడులు తగదు

ఆమనగల్లు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై సనాతన ధర్మం పేరుతో అయ్యప్ప స్వాముల ముసుగులో దాడికి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్, దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. రాములుపై దాడిని ఖండిస్తూ ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సుధాకర్ హాజరయ్యారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు మల్లెపోగు మల్లేశ్, వస్పుల సాయిలు, పులికంటి మైసయ్య సుధాకర్, భిక్షపతి, బాల్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

బాధిత కుటుంబానికి చేయూత

తలకొండపల్లి/ఆమనగల్లు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తర్నికల్ తండాకు చెందిన రాత్లావత్ కమ్లి సీత్యనాయక్ పూరిల్లు ప్రమాదవశాత్తు పూర్తిగా కాలిపోయింది. దాంతో ఆ కుటుంబం వీధిన పడింది. విషయం తెలుసుకున్న తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు సమకూర్చగా ట్రస్ట్ సభ్యులు అందజేశారు. గణేశ్, సురేశ్‌గౌడ్, రుక్మొద్దీన్, దేవయ్య, తదితరులున్నారు. నిరుపేదలకు ఐక్యత ఫౌండేషన్ అన్నివిధాలా అండగా ఉంటుందని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సీత్యనాయక్ కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు సమకూర్చగా ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్‌గౌడ్, బాలరాజ్, రాజు నాయక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



తలకొండపల్లి : నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కేశంపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా, మండల స్థాయి అధికారులుగా బాధ్యతలు నిర్వహించి ఆకట్టుకున్నారు. విద్యార్థులు వారి వారి బాధ్యతలను నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ అభినందించి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

షాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బాలానందస్వామి తెలిపారు, మండల పరిధిలోని నాగర్‌కుంటలో నిర్మించిన శ్రీహనుమాన్ దేవాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఫిబ్రవరిలో ఆలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. సర్దార్‌నగర్ ఏఎంసీ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివకుమార్, గ్రామస్థులు మల్లయ్య, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.